క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల పరిశీలన



దంతాలపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగన్న మాట్లాడుతూ..ధాన్యంకొనుగోలు విషయంలో ప్రభుత్వం, ప్రైవేట్ వ్యాపారస్తులు రైతులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకన్ననారాయణ, వెంకటేష్, నరేష్, సోమనర్సయ్య, రామ్‌రెడ్డి, యాకన్న, సాయి, సురేష్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కొత్తగూడ : బాలికలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధి నలమాస అరుణ అన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పోలార కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, హక్కుల గూర్చి వివరించారు. అనంతరం వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. సౌజన్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



గంగారం : మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా మండలంలో పటిష్టమైన భద్రత, నిఘా ఏర్పాట్లు చేసినట్లు గూడూరు సీఐ బాబురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాలతో పాటు ఆర్‌పీఓ, కల్వర్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సంఘ విద్రోహుల కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో కొత్తవారు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఏజెన్సీ యువత ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను పొంది, వారి జీవితాలను బాగుపర్చుకోవాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయి, గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఎలాంటి పరిస్థితుల్లోను డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని సూచించారు. తిరుమలగండి గ్రామ యువతకు వాలీబాల్ కిట్‌ను సీఐ బాబురావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవి కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బైక్

కురవి : భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురం దగ్గరలోని ఆనందపురం గ్రామానికి చెందిన జినక శ్రీను బుధవారం మహబూబాబాద్ నుంచి కురవి వైపు బైక్‌పై వస్తున్నాడు. అదే మార్గంలో కురవి వైపు ఆటో వస్తోంది. ఈ క్రమంలో పెట్రోల్‌బంక్ సమీపంలో జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో బ్రేకులు వేయడంతో వెనుక నుంచి స్పీడుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే పోలీసులు క్షతగాత్రుడిని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం



ఉదయ్ కిరణ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మున్సిపల్ పరిధి జమాండ్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జమాండ్లపల్లికి చెందిన సిలువేరు ఉదయ్‌కిరణ్ (21) జిల్లా కేంద్రంలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం రోదిస్తూ తల్లిదండ్రులకు, తమ్ముడికి, బంధువులకు ఫోన్ చేసి అన్నం తిన్నారా అని అడిగి వెంటనే ఫోన్ కట్ చేశాడు. తల్లిదండ్రులు, తమ్ముడు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తమ్ముడు అజయ్ కుమార్ ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఆందోళనకు గురై వెంటనే ఇంటికి వచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు పిలిచిన ఎలాంటి స్పందన లేకపోవడంతో తలుపులు తొలగించి ఇంట్లోకి వెళ్లి చూశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అతడిని వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతిచెందాడని ధ్రువీకరించారు. తన కుమారుడు ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నట్లు మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు చేశారన్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకన్న శవ పంచనామా నిర్వహించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

గుంతలుగా మారుతున్న ఎడ్జెర్ల పెద్దచెరువు
- టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపిన రైతులు
- ఇప్పటికే నీటి సామర్థ్యం పెరిగి కరకట్ట తెగిపోయిందని ఆవేదన



ఎడ్జెర్ల పెద్దచెరువు నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను అడ్డుకున్న రైతులు

మరిపెడ రూరల్ : అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్నారని మండలంలోని ఎడ్జెర్ల గ్రామ శివారు పెద్దచెరువులోని టిప్పర్లను బుధవారం రైతులు అడ్డుకున్నారు. ఈ మేరకు అడ్డుకున్న టిప్పర్ల ఎదుట రైతులు నిరసనకు దిగారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం రోజులుగా రేయింబవళ్లు తేడా లేకండా గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణానికి అని చెబుతూ ఎడ్జెర్ల చెరువు నుంచి వందలాది ట్రిప్పుల మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. దీంతో చెరువులో పొక్లెయినర్ ద్వారా చెరువు మొత్తం తవ్వుతూ భారీ గుంతలు చేస్తూ మట్టిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును లోతుగా తవ్వడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి చెరువు కరకట్ట ఇప్పటికే తెగిపోయిందని అన్నదాతలు వాపోయారు. దీంతో తమకు పంటలు పండే అవకాశం లేకుండా పోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ చెరువును మరింత లోతు తవ్వుతున్నారని అన్నారు. ఇప్పటికే చెరువులో తవ్విన గుంతల్లో పడి ఇద్దరు వ్యక్తులు, మూగజీవాలు ప్రాణాలు పోయినట్లు తెలిపారు. అధికారులు స్పందించి చెరువుమట్టిని తరలించకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారి రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ నిర్వాహకులు ఎడ్జెర్ల చెరువు మట్టి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం శ్రీను, చిత్తనూరి కృష్ణ, మల్లెపంగు సుధాకర్, గునిగంటి కృష్ణ, శానం శ్రీహరి, ఉప్పలయ్య, గోపి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

కేసముద్రం: హాస్టళ్లలో విద్యార్థునులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. బుధవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలకు హాజరై మాట్లాడారు. అనంతరం స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు భోజనాలు, పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనంచేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని అక్కడున్న అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ క్రాంతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సతీష్, భద్రమ్మ, మీటునాయక్, బాబురావు, రాజేందర్‌రెడ్డి, కొట్టం మహేందర్, అశోక్‌గౌడ్, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదతో ఆర్థికాభివృద్ధి

మహబూబాబాద్ రూరల్ : పశు సంపద ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని ఉమ్మడి వరంగల్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి రఘుబాబు అన్నారు. మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన, పాల ఉత్పత్తి పోటీలు బుధవారం నిర్వహించారు. బలపాల, డోర్నకల్ పశు వైద్యులు అశోక్, నాగేశ్వర్‌రావు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి, ముగ్గురు ఉత్తమ పాడి రైతులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 167 పశువులకు చికిత్సలు, మందులు అందజేసి, గర్భధారణ పరీక్షలు నిర్వహించారు.

దివ్యాంగుల దినోత్సవం

కురవి : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కేంద్రంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిషాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'న్యాస్' పరీక్ష కేంద్రాల తనిఖీ



గార్ల: పరీక్షను తనిఖీ చేస్తున్న ఎంఈఓ, జీసీడీఓ



మరిపెడ రూరల్: కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎంఈఓ

గార్ల/బయ్యారం : జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు గార్ల నిర్మలా హైస్కూల్‌లో 3వ తరగతి విద్యార్థులకు బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) పరీక్ష గార్ల ఎంఈఓ ఎం.వీరభద్రం పర్యవేక్షణలో నిర్వహించారు. గార్ల,బయ్యారంలోని పరీక్ష కేంద్రాలను జీసీడీఓ విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయ్యారం ఎంఈఓ దేవేంద్రాచారి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, అబ్జర్వర్ ఉమాకర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి: ఎంఈఓ

మరిపెడ రూరల్ : బోధనలో విద్యా ప్రమాణాలు పెంచాలని ఎంఈఓ అనితాదేవి అన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌సీఆర్‌టీ అండ్ ఎస్సీఆర్‌టీ ఆధ్వర్యంలో 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్షలను బుధవారం నిర్వహించగా ఆమె సందర్శించారు.

నెల్లికుదురు : మండలంలోని జామతండా పీఎస్, నర్సింహులగూడెం ప్రాథమికోన్నత పాఠశాల, నెల్లికుదురు, మేచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఆదర్శ పాఠశాలల్లో నాస్ పరీక్షను బుధవారం నిర్వహించినట్లు ఎంఈఓ రాందాస్‌తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బయ్యారం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని గంధంపల్లికి చెందిన ఉపాధ్యాయుడు సంద్ర ఉపేందర్‌రావు కుటుంబానికి పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భద్రునాయక్, వివిధ సంఘాల ఉపాధ్యాయులు రవీందర్, బిచ్చనాయక్, రూప్లా, రవి, వీరన్న, దస్తగిరి, కృష్ణ, శ్రీకాంత్, భాస్‌సింగ్, రాంజీ, కిషన్, సత్యనారాయణసింగ్, బాలాజీ పాల్గొన్నారు.

పాపన్న విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబాబాద్ /మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు అనుమతి ఇవ్వాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్న కోరారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్నతో పాటు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు సమ్మెట వెంకన్న, రాజేందర్, శ్రీనివాస్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె బాట

- డీఈఓకు వినతిపత్రం అందజేత



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్ : విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెకు సిద్ధమైనట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మహంకాళి వీరన్న తెలిపారు. ఈ మేరకు డీఈఓ రవీందర్ రెడ్డికి బుధవారం వారు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వీరన్న మాట్లాడుతూ.. 18 సంవత్సరాలుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్నామని తమను రెగ్యులర్ చేయాలన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి రిలే దీక్షలు, 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామన్నారు. ప్రతి ఉద్యోగికి ఆరోగ్య బీమా ద్వారా రూ.10 లక్షలు, జీవిత బీమా రూ.20 లక్షలు ఇవ్వాలని కోరారు. మహిళా ఉద్యోగికి ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. పదవి విరమణ పొందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకి రూ.20 లక్షల ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల సంఘం నాయకులు భాస్కరరావు, నదీమ్, రమేశ్, హసీనా, బిందు, ప్రభావతి, నారాయణ, గణేష్, భిక్షపతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

నెల్లికుదురు : సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని మెసెంజర్ల జిల్లా అధ్యక్షుడు రత్నపురపు యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 6, 7న జిల్లా కేంద్రంలో చేపట్టే రిలే నిరాహార దీక్ష సమ్మె నోటీసును బుధవారం ఎంఈఓ రాందాస్‌కు అందజేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎన్నిక



దంతాలపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా దాట్ల గ్రామానికి చెందిన సురేష్ గౌడ్ గెలుపొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ..తన గెలుపునకు సహకరించిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శరత్



కురవి : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కురవికి చెందిన డాక్టర్ దడిగల శరత్ విజయం సాధించాడు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బుధవారం సాయంత్రం ఫలితాలు విడుదల చేశారని ఆయన తెలిపారు. పార్టీ అభివృద్ధిలో యువకుల పాత్ర పెంచేలా పాటుపడుతానని తెలిపారు.

గార్ల మండల అధ్యక్షుడిగా రాజీవ్‌నాయుడు



గార్ల : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా అందనాల రాజీవ్ నాయుడు ఎన్నికైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు బుధవారం వెల్లడించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఆన్‌లైన్ ఎన్నికల్లో మండలం నుంచి నలుగురు పోటీ చేశారు. వీరిలో అందనాల రాజీవ్‌నాయుడుకు అత్యధికంగా 746 ఓట్లు రావడంతో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడుగా ఎన్నికై నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన రాజీవ్‌నాయుడును కాంగ్రెస్ పార్టీ మండల శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

ఓపెన్ ప్రవేశాలకు గడువు పెంపు

నెల్లికుదురు : ఓపెన్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జీవన్ కుమార్ బుధవారం తెలిపారు. పూర్తి వివరాలకు 97015 75227 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పొదుపుపై అవగాహన కల్పించాలి

మరిపెడ రూరల్ : పొదుపుతోనే ఆర్థిక అసమానతలు తొలగిపోతాయని ప్రగతి సేవా సమితి మండల కో ఆర్డినేటర్ ఐనాల పరశురాములు అన్నారు. బుధవారం అబ్బాయిపాలెం ప్రగతి సేవా సమితి కార్యాలయంలో కో ఆర్డినేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరశురాములు మాట్లాడుతూ గ్రామ కోఆర్డినేటర్లు మహిళలు, రైతులు, కార్మికులు, వివిధ రంగాల్లో పని చేసే వారిని సమీకరించి అవగాహన కల్పించాలన్నారు.

మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

నెల్లికుదురు : సైబర్ మోసాలతో జాగ్రత్తగా ఉండాల ని ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. మండల కే ంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ జాగ్రుతా దివస్‌పై మోసం జరిగే విధానం, తీసుకోవాలని జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

బియ్యం అందజేత


కురవి : మండలంలోని బలపాలకు చెందిన గోల్కొండ హేమలత ఇటీవల మృతి చెందగా ఇద్దరు బాలికలు అనాథలుగా మారారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన మధుకర్, నవీన్, రాజు, రవి 50కిలోల బియ్యంను బుధవారం బాలికలకు అందజేశారు.

వసతులు కల్పించాలి

నెహ్రూసెంటర్ : మున్సిపల్ పరిధిలోని వార్డులు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. 25వ వార్డు ధర్మన్న కాలనీని బుధవారం పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగు కుమార్, నవీన్, తోట రాజకుమారి, మంద శంకర్, మాలోత్ రవీందర్, తండ శ్రీనాథ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

- హరిత మిత్ర అవార్డు గ్రహీత వెంకన్న



మహబూబాబాద్ రూరల్ : ప్రకృతి వైపరీత్యాల నుంచి పర్యావరణాన్ని రక్షించుకుందామని హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ నగర్ కాలనీకి చెందిన పోలీసు కానిస్టేబుల్ అశోక్‌కు బుధవారం వెంకన్న మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచి ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అమ్మ పేరుతో లక్ష మొక్కలు నాటాలని సంకల్పించామని తెలిపారు. వన్య ప్రాణులను కాపాడాలని, నీటి, వాయు కాలుష్యాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి చేతి సంచులను వాడుకోవాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

తొర్రూరు : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుంటానని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో పీఆర్‌టీయూ కోఆపరేటివ్ సొసైటీ సమావేశం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మిరియాల సతీష్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో గళమెత్తుతానని తెలిపారు. మధ్యాహ్న భోజన లోపాల వ్యవహారంలో ఉపాధ్యాయులను బాధ్యులుగా చేసే చర్యలు మానుకోవాలన్నారు. కోఆపరేటివ్ అధ్యక్షుడు వజినేపల్లి రమేష్, మండల అధ్యక్షుడు విప్లవ్‌రెడ్డి, నాయకులు పులి ముత్తిలింగం, సురేష్‌కుమార్, రమేష్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, లింగమూర్తి, వెంకటకరుణాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కురవి : ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం రాయల మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు, కేంద్రం మరో రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆకుల రాజు, మలేడి కోటయ్య, పిట్టల వెంకన్న, కడియం సత్యం, జక్కుల మల్లయ్య, నాళం వెంకన్న, మల్లయ్య, మాలోత్ కిషన్, తిరుపతి, కట్ల కృష్ణయ్య, మంజుల పాల్గొన్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి



డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్ : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని, డిపోకు అదనంగా 20 బస్సులను కేటాయించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరగడంతో సరిపోను బస్సులు లేక వారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం నుంచి అన్ని మండల కేంద్రాలతో పాటు ప్రధాన గ్రామాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 9వ తేదీన బస్సుభవన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, ఉమ్మగాని సత్యం, పల్లెల పాపారావు, పైండ్ల యాకయ్య, కందాల రంగయ్య, జక్కుల యాకయ్య, ఈర్ల వెంకన్న, పైండ్ల రాజు, లింగస్వామి, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్

మహబూబాబాద్ : ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, మూడేళ్ల లెప్రసీ సర్వే, పల్స్‌పోలియో కార్యక్రమాల పెండింగ్ డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ వెంటనే సర్వే డబ్బులు మంజూరు చేయాలని తెలిపారు. ఆశ వర్కర్లు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట రాజమౌళి, నాగన్న,ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సుజిత, ఆసియా, నళిని, సవిత, విజయ, జ్యోతి, రమాదేవి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శ్రమదానం

గార్ల : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం గార్లలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం నిర్వహించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీడీఓ మంగమ్మ, కార్యదర్శులు అజ్మీర కిషన్, ర మేష్, సరస్వతి, వెంకటేష్ పాల్గొన్నారు.

పరామర్శ

డోర్నకల్ : మండలంలోని కొత్తదుబ్బతండా శివారు చింతల్‌తండాకు చెందిన తేజావత్ వస్రాం(55) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా వస్రాం మృతదేహంపై మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు.

హిందువులకు రక్షణ కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్ : బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని మానుకోట జిల్లా కేంద్రంలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలిపారు. హిందూ సంఘాల నాయకులు శ్యాంసుందర్ శర్మ, మురళి, రామ్, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

కురవి : మండల కేంద్రంలో అయ్యప్ప మాలధారులకు, వీరభద్రస్వామి మాలధరించిన స్వాములకు ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప, వీరభద్రస్వామి మాలధరించిన స్వాములు పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : మొక్కలు నాటి సంరక్షించుకోవాలని నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమా కోరారు. ఈ మేరకు బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలో భూకంపం సంభవించిన నేపథ్యంలో సంస్థ ఆధ్వర్యంలో 'పర్యావరణాన్ని విధ్వంసం చేస్తుండటం వల్లే భూకంపాలు సంభవిస్తున్నాయి' అనే ప్లకార్డుతో ఆమె ప్రచారం నిర్వహించారు. ఇప్పటికైనా మొక్కలు నాటి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించుకోవాలన్నారు.

విద్యార్థులకు అవగాహన

కేసముద్రం : మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా షీ టీం ఎస్సై సునంద మాట్లాడుతూ..బాలికల భద్రత షీ టీం లక్ష్యమన్నారు.

చర్యలు తీసుకోవాలి

కేసముద్రం : మిల్లుల్లో, ట్రేడింగ్ కంపెనీల వద్ద నేరుగా ఖరీదు చేస్తూ ధాన్యం ట్రాక్టర్‌కు 30 కేజీల కోత విధిస్తున్నారని, అలాంటి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని జై కిసాన్ రైతు పరస్పర సహకార పొదుపు పరపతి మార్కెటింగ్ సంఘం మండల అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆసంఘం ఆధ్వర్యంలో స్పెషల్‌గ్రేడ్ సెక్రటరీకి వినతి పత్రాన్ని అందజేశారు. భూలోక్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి రాములోరి వార్షికోత్సవం..

మహబూబాబాద్ రూరల్ : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళ శాసనములతో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి చతుర్థ వార్షికోత్సవ వేడుకలు మహబూబాబాద్ మండలంలోని రెడ్యాలలో గురువారం రాత్రి ప్రారంభం కానున్నాయి.